7 నెలల్లో 1,33,174 కోట్లు

- రాష్ట్ర రాబడి ఆశాజనకం
- నిరుటికంటే 27,987 కోట్లు అధికం
- ప్రధాన వాటా జీఎస్టీదే
- 26,407 కోట్లు వసూలు
- కేంద్రం వివక్ష షరా మామూలే
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ నామమాత్రమే
- బడ్జెట్ అంచనాలో 9 శాతమే
- తాజా నివేదికలో కాగ్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చిన్న రాష్ట్రమైనప్పటికీ దేశంలోని అనేక పెద్దరాష్ట్రాలను వెనక్కి నెట్టి ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నది. ఏటికేడు రాబడిని పెంచుకుంటూ మరింత ముందుకెళ్తున్నట్టు కంప్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తాజా నివేదికలో మరోసారి రుజువైంది. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,59,862 కోట్ల రాబడి వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం.. తొలి 7 నెలల్లో (ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు) రూ.1,33,174 కోట్ల రాబడి సాధించింది. ఇది బడ్జెట్ అంచనాలో 51.25 శాతానికి సమానం. నిరుడు ఇదే సమయంలో రాష్ట్రానికి రూ.1,05,187 కోట్ల రాబడి వచ్చింది. దీనితో పోలిస్తే ఈసారి రాష్ట్ర రాబడి రూ.27,987 కోట్లు పెరిగింది. స్వరాష్ట్రంగా ఆవిర్భవించాక తొలి ఆర్థిక సంవత్సరం (2014-15)లో అక్టోబర్ వరకు వచ్చిన రాబడి రూ.22,300 కోట్లు మాత్రమే. అంటే.. గత పదేండ్లలో రాష్ట్ర రాబడి రూ.1,10,874 కోట్లు (దాదాపు 5 రెట్లు) పెరిగింది. ముఖ్యమంత్రి కేచంద్రశేఖర్‌రావు పటిష్ఠ ఆర్థిక ప్రణాళికతోనే ఇది సాధ్యమైంది. ఇంత భారీ వృద్ధిరేటు మరే రాష్ట్రంలోనూ నమోదు కాలేదు.

ప్రధాన వాటా జీఎస్టీదే

రాష్ట్ర రాబడిలో ప్రధాన వాటా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)దే. ఈ ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రూపేణా రాష్ట్రానికి రూ.50,942 కోట్ల రాబడి వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేయగా.. తొలి 7 నెలల్లో 52 శాతం (రూ.26,408 కోట్లు) వచ్చింది. నిరుడు ఇదే సమయానికి జీఎస్టీ ద్వారా రూ.23,493 కోట్లు వచ్చాయి. దీనితో పోలిస్తే ఈసారి జీఎస్టీ రాబడి రూ.2,915 కోట్లు పెరిగింది. దేశంలో జీఎస్టీని ప్రవేశపెట్టాక తొలి ఆర్థిక సంవత్సరం (2018-19)లో రూ.16,429 కోట్లుగా ఉన్న రాష్ట్ర రాబడి గత ఐదేండ్లలో రూ.9,979 కోట్లు పెరిగింది.

తెలంగాణపై అదే కక్ష

తెలంగాణపై నరేంద్రమోదీ సర్కారు అదే కక్ష సాధింపు ధోరణిని కొనసాగిస్తున్నది. ప్రతిఏటా వలే ఈసారి ఆర్థిక వివక్షను చూపుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్-ఇన్-ఎయిడ్ రూపేణా మొత్తం రూ.41,259 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేయగా.. అక్టోబర్ వరకు మోదీ సర్కారు విదిల్చింది రూ.3,835 కోట్లు (9 శాతం) మాత్రమే. గ్రాంట్-ఇన్-ఎయిడ్ విషయంలో కేంద్రం ఏటా ఇలాగే వ్యవహరిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.41,001 కోట్ల గ్రాంట్-ఇన్-ఎయిడ్ వస్తుందని రాష్ట్ర బడ్జెట్‌లో అంచనా వేయగా.. అక్టోబర్ వరకు కేంద్రం రూ.5,592 కోట్లు మాత్రమే ఇచ్చింది. దీనితో పోల్చినా ఈసారి రాష్ట్రానికి రూ.1,757 కోట్ల గ్రాంట్ తక్కువగా వచ్చింది. ఆర్థిక రంగంలో తెలంగాణ అనూహ్య వృద్ధి సాధించడాన్ని జీర్ణించుకోలేకపోతున్న మోదీ సర్కారు రాజ్యాంగ బద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులను సైతం ఇవ్వకుండా వేధిస్తున్నది. దేశంలోని బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు అంచనాలకు మించి గ్రాంట్ ఇస్తూ.. తెలంగాణపై మాత్రం వివక్ష చూపుతున్నది. దేశంలోని మిగిలిన రాష్ట్రాల వలే తెలంగాణకు కూడా కేంద్రం చేయూతనిస్తే రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం మరింత తేజోమానంగా వెలిగిపోయేది.

ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రధాన రాబడులు

అంశం	బడ్జెట్ అంచనా (రూ.కోట్లలో)	తొలి 7 నెలల రాబడి (రూ.కోట్లలో)	అంచనాలో రాబడి శాతం
జీఎస్టీ	50,942.66	26,407.90	51.84
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	18,500.00	8,227.86	44.47
అమ్మకం పన్ను	39,500.00	17,334.35	43.88
కేంద్రపన్నుల వాటా	14,528.18	7,139.84	49.14
ఎక్సైజ్ సుంకాలు	19,884.90	13,695.75	68.88
ఇతర పన్నులు, సుంకాలు	9,131.70	4,576.80	50.12
గ్రాంట్-ఇన్-ఎయిడ్	41,259.17	38,35.91	9.30
అప్పులు	38,234.94	33,378.34	87.30

ముగ్గురు పిల్లల నిబంధన పల్లెకు, పట్టణానికి వేర్వేరు ఎలా?

- స్థానిక, మున్సిపల్ ఎన్నికల రూల్స్‌పై పిటిషన్
- సోమవారం విచారణ చేపట్టనున్న హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులన్న నిబంధనలు గ్రామీణ ప్రాంతాలకు ఒక రకంగా, పట్టణ ప్రాంతాలకు మరో రకంగా ఉండటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని 213వ సెక్షన్‌ను సవాలు చేస్తూ న్యాయవాది రాపోలు భాస్కర్ ఈ పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలు వేర్వేరుగా ఉండటం సమానత్వానికి వ్యతిరేకమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలున్నవారు పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ తదితర ఎన్నికల్లో పోటీకి అనర్హులన్న పంచాయతీ రాజ్ చట్ట నిబంధనలు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు వర్తించడం లేదని.. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, కార్పొరేషన్ మేయర్, కార్పొరేటర్ పదవులకు పోటీ చేసేవారికి పిల్లల సంఖ్యతో సంబంధం లేదని తెలంగాణ మున్సిపాలిటీ చట్టం స్పష్టం చేస్తున్నదని వివరించారు. ఈ వ్యత్యాసం సహజ న్యాయ సూత్రాలతోపాటు రాజ్యాంగంలోని 13, 14, 19 అధికరణలకు విరుద్ధమని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టంలోని 213వ సెక్షన్‌ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ సోమవారం విచారణ చేపట్టనున్నది.

అవార్డుతో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్, సిబ్బంది

జలమండలికి అవార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జలమండలికి ఈ ఏడాది మరో పురస్కారం లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) నేషనల్ అవార్డు-2023ను జలమండలి కైవసం చేసుకున్నది. ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టివల్-2023లో 'కాఫీ టేబుల్ బుక్' క్యాటగిరీలో జలమండలికి ద్వితీయ బహుమతి లభించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), ఇతర మల్టినేషనల్ కంపెనీలతో పోటీపడి ఈ అవార్డును దక్కించుకున్నది. గత నెల 27న ఢిల్లీలో ఈ అవార్డు ప్రదానం చేసింది. ఈ పురస్కారం దక్కడంపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి పీఆర్వో సుభాష్, ఓఎస్డీ పీఆర్వో మనోహరాచారి శనివారం పురస్కారాన్ని ఎండీకి అందించారు. ఈ సందర్భంగా ఎండీ అభినందించారు. నిరుడు పీఆర్ఎస్ఐ నిర్వహించిన వివిధ పోటీల్లో జలమండలికి రెండు అవార్డులు దక్కాయి. జలమండలి పీఆర్ఎస్ఐ నేషనల్ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది నాలుగోసారి కావడం విశేషం. జలమండలి ఈ ఏడాది ఇప్పటికే 4 అవార్డులు దక్కాయి. మార్చి 18న వరల్డ్ వాటర్, మే 1న ఉత్తమ యాజమాన్య, జులై 5న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), ఆగస్టు 1న గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ- 2023 అవార్డులు వచ్చాయి. తాజా అవార్డుతో మొత్తం జలమండలి ఈ ఏడాది 5 పురస్కారాలను తన ఖాతాలో వేసుకున్నది.

ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

డీఏ విడుదలకు ఎన్నికల కమిషన్ అనుమతి

- 3.64 శాతానికి కరువుభత్యం
- 7 లక్షల మందికి ప్రయోజనం

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇది శుభవార్తే. ఒక కరువు భత్యం (డీఏ) విడుదలకు ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతినిచ్చింది. అక్టోబర్ నెల నుంచి డీఏ చెల్లించేందుకు అభ్యంతరం లేదని శనివారం ఈసీ ప్రకటించింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఒక డీఏ విడుదలకు అనుమతివ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి లేఖ రాసింది. టీఎన్జీవో కేంద్ర సంఘం నేతలు సైతం ఈసీని కలిసి పెండింగ్ డీఏ విడుదలకు అనుమతినివ్వాలని కోరారు. పలు కారణాలతో అప్పట్లో ఈసీ అనుమతినివ్వకపోవడంతో డీఏ విడుదలకు బ్రేక్ పడింది. పోలింగ్ పూర్తికావడం, ఓటర్లు ప్రభావితులయ్యే అవకాశం లేకపోవడంతో డీఏ విడుదలకు తాజాగా ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తమ విన్నపం మేరకు డీఏ విడుదలకు అనుమతినివ్వడంపై టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, టీజీవో అధ్యక్షప్రధాన కార్యదర్శులు వీ మమత, ఏ సత్యనారాయణ ఈసీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని డీఏ విడుదల చేయాలని కోరారు.

23.66 శాతానికి డీఏ

ఈసీ అనుమతి నేపథ్యంలో ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించే డీఏ 3.64శాతం పెరుగుతుంది. మూలవేతనంపై ప్రస్తుతం 20.02% డీఏ చెల్లిస్తుండగా, తాజా పెంపుతో డీఏ 23.66 శాతానికి చేరుతుంది. 6 నెలలకు ఒక డీఏను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు విడుదల చేసే డీఏ 1-7-2022కు చెందినది. ఈసీ అనుమతితో డీఏను ప్రభుత్వం విడుదల చేస్తే జీపీఎఫ్ ఉన్న వారికి జీపీఎఫ్‌లో కలుస్తుంది. సీపీఎస్ ఉద్యోగులకు 10శాతం ప్రాన్ అకౌంట్‌కు, 90 శాతం ఎరియర్స్‌ను 8 సమాన వాటాల్లో అందజేస్తారు. డీఏ విడుదల ద్వారా రాష్ట్రంలోని 4.40 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 2.88 లక్షల పెన్షనర్లు లబ్ధిపొందుతారని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

12న బీసీల 'చలో ఢిల్లీ'

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, డిసెంబర్2 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి బీసీలకు రాజకీయ రంగంలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు 12న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, బీసీ కులగణన, బీసీ రిజర్వేషన్ పెంపు తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16 వరకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. బీజేపీ తన పాలనలో బీసీ సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు.

పెండ్లి వేడుకలా ఎన్నికలు

- ఎన్నికల సిబ్బందికి మంగళ హారతితో స్వాగతం
- ఉదయం స్నానానికి వేడినీళ్లు, టూత్‌పేస్ట్, సబ్బులు
- అతిథుల్లా సపర్యలు, సమయానికి రుచికరమైన భోజనం
- వినూత్నంగా మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ చర్యలు

మంచిర్యాల జిల్లాలో ఎన్నికల సిబ్బందికి మంగళహారతితో స్వాగతం పలుకుతున్న స్థానికులు. సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్

మంచిర్యాల, డిసెంబర్ 2: ఎన్నికలు అనగానే ఓటర్ల కోసం సవాలక్ష సౌకర్యాలు చేయటం చూస్తుంటాం. కానీ, ఎన్నికల సిబ్బందిని అంతగా పట్టించుకోరు. డ్యూటీకి వచ్చారు కాబట్టి వాళ్లకు టీ, టిఫిన్, భోజనం పెట్టేసి మమ అనిపించటం కామన్. అయితే, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బందికి అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గొప్ప అనుభూతి కల్పించే సౌకర్యాలు కల్పించారు. సిబ్బంది రాగానే వారికి మంగళహారతులు, పూల బొకేలతో స్వాగతం పలికారు. పోలింగ్ కేంద్రానికి ఒక రోజు ముందుగానే రావాల్సి ఉండగా, వారికి ఆ రోజు రాత్రి నచ్చిన భోజనం అందించారు. అన్నింటికన్నా ముఖ్యంగా ఉదయం నిద్ర లేవగానే వారికోసం స్నానానికి వేడినీళ్లు సబ్బు, టూత్‌పేస్ట్ ఇచ్చారు. విధులకు హాజరయ్యేలోపే టీ, టిఫిన్ వారి ముందుంచారు. మధ్యాహ్నానికి రుచికరమైన భోజనం, మంచినీటిని అందించారు. పోలింగ్ ముగిసిన తర్వాత కవర్లు, ఇతర సామగ్రిని సులభంగా ప్యాకింగ్ చేసుకొనేలా సౌకర్యాలు కల్పించారు. అడిషనల్ కలెక్టర్ తానే స్వయంగా రాసిన ప్రశంసాపత్రాలతో సిబ్బందిని సత్కరించారు. పోలింగ్ ముగిసిన వెంటనే అక్కడికక్కడే రెమ్యునరేషన్ అందించడం విశేషం. చివరికి ఇంటికి చేరుకోవటానికి కూడా బస్సు సౌకర్యం కల్పించటంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల విధులకు హాజరైన ఓ పీఈటీ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల విధులకు హాజరవటం వివాహ వేడుకకు వచ్చినట్టు ఉన్నదని వెల్లడించారు. తన 24 ఏండ్ల సర్వీసులో ఇలా ఆనందంగా ఎన్నికల విధులు నిర్వర్తించిన సందర్భాలు లేవని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో పలికిన స్వాగతానికి ఎన్నికల సిబ్బంది, భద్రతాసిబ్బంది అంతా ఆశ్చర్యపోయామని పేర్కొన్నారు.

రామగుండంలోని కమిషనరేట్‌లో మావోయిస్టుల అరెస్ట్ చూపిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 2: మంచిర్యాల జిల్లా ఇందారంలో మావోయిస్టు దంపతులను అరెస్ట్ చేసినట్టు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. శనివారం రామగుండంలోని కమిషనరేట్‌లో ఆమె మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇందారంలోని ఓ ఇంట్లో సీపీఐ మావోయిస్టు పార్టీ సెంట్రల్ టెక్నికల్ టీమ్ క్యాడర్ డీ గంగాధరరావు అలియాస్ నర్సన్న అలియాస్ బక్కన్న అలియాస్ వెంగోదాదాతోపాటు అతని భార్య భవానీ అలియాస్ సుజాత అలియాస్ శ్యామల ఉన్నట్టు అందిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందం సభ్యులు అక్కడికి వెళ్లారు. వారిని అదుపులోకి తీసుకొని, ఠాణాకు తరలించారు. వారి వద్ద రూ.1.57 లక్షల నగదు, పాన్‌కార్డు, ఏటీఎం కార్డు, రెండు ఆధార్‌కార్డులు, బ్యాంకు పాస్‌బుక్, రెండు మొబైల్ ఫోన్లు, ఆరు మెమరీ కార్డులు, ట్యాబ్, రెండు పెన్‌డ్రైవ్‌లు, పార్టీకి సంబంధించిన కీలక పత్రాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరికి పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన మావోయిస్టు సానుభూతిపరుడు చిప్పకుర్తి శ్రీనివాస్ సాయం చేసినట్టు తెలిసింది. కాగా అతను పరారీలో ఉన్నట్టు సీపీ తెలిపారు. వీరు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రెండు, మూడేండ్లుగా తిరుగుతూ పార్టీ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. గంగాధర్‌రావుపై రూ.20 లక్షలు, ఆయన భార్య భవానీపై రూ.4 లక్షల రివార్డు ఉన్నట్టు ఆమె పేర్కొన్నారు.

నాలుగు రోజులు వర్షాలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఆదివారం అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రాష్ట్రంలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. ఏపీకి మిచాంగ్ తుఫాన్ ముప్పు పొంచి ఉందని, కోస్తాంధ్ర జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

ఏపీకి మిచాంగ్ తుపాన్ ముప్పు

ఏపీకి మిచాంగ్ తుపాన్ ముప్పు పొంచి ఉంది. కోస్తాంధ్ర వైపుకు తుఫాన్ దూసుకొస్తున్నది. దీంతో కోస్తాంధ్ర జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాయలసీమలోనూ తుపాను ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ అధికారుల సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మిచాంగ్ తుఫాన్ కారణంగా నేటి నుంచి నాలుగైదు రోజులపాటు ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నది. ఈ నెల 5వ తేదీన నెల్లూరు-మచిలీపట్నం వద్ద మిచాంగ్ తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నది. ఆది, సోమవారాల్లో ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం దక్షిణ కోస్తా, ఉత్తరకోస్తాలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాను నేపథ్యంలో తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్టేట్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ ఎండీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఏపీ సీఎం జగన్ ఆదేశించారు.

ఐఎఫ్‌ఎఫ్ఐ స్క్రీనింగ్‌కు 'ది లైట్' చిత్రం ఎంపిక

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్‌ఎఫ్ఐ) స్క్రీనింగ్‌కు యానిమేటెడ్ మూవీ 'ది లైట్' ఎంపికైంది. బ్రహ్మకుమారీ గుడ్‌వుడ్ స్టూడియో ద్వారా నిర్మించిన ఈ చిత్రం మానవుడి మానసిక దృక్పథాన్ని సకారాత్మక దిశగా తీసుకెళ్లేందుకు దోహదపడే అద్భుత చిత్రం. స్వపరివర్తన ద్వారా విశ్వపరివర్తన సాధ్యమని నిరూపించే ఆధ్మాత్మిక జీవన విధానాన్ని తెలిపే అంశాలను ఇందులో చూపించారు. చిత్ర నిర్మాత హరిలాల్ భానుశాలి, బ్రహ్మకుమారీస్ అడిషనల్ చీఫ్ రాగయోగిని జయంతిదీది, సుర్జిత్ సర్కార్ ఈ చిత్రప్రదర్శనలో పాల్గొన్నారు.





డీసీఎంలో నుంచి బీరు పెట్టెలను తీసి జాతీయ రహదారిపై పగులగొడుతున్న యజమాని

అర్ధరాత్రి వైన్స్ షాపు యజమాని వీరంగం

- జాతీయ రహదారిపై మద్యం బాటిళ్లను పగులగొట్టిన వైనం
- జనావాసాల మధ్య దుకాణం వద్దన్నందుకు రగడ

ములుగు, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): ములుగు జిల్లాకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వైన్స్ షాపు ముందు శుక్రవారం అర్ధరాత్రి సంబంధిత షాపు యజమాని నరేందర్‌రెడ్డి వీరంగం సృష్టించారు. స్థానిక ఆటోనగర్‌లో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పాత రైస్ మిల్లు వద్ద నూతన వైన్స్ షాపు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వైన్స్ పెట్టవద్దని స్థానికులు సూచిస్తూ వస్తున్నారు. కాగా, శుక్రవారం అర్ధరాత్రి డీసీఎంలో మద్యం లోడ్ వచ్చింది. అక్కడి చేరుకున్న స్థానికులు ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల తమకు ఇబ్బందులు ఏర్పడతాయని అభ్యంతరం చెప్పారు. దీంతో షాపు యజమాని కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేసేందుకు డీసీఎంలో ఉన్న బీర్ల పెట్టెలను జాతీయ రహదారిపై పగులగొట్టి వీరంగం సృష్టించాడు. ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా కాలనీవాసుల ఫిర్యాదు మేరకు షాపు అక్కడ వద్దని చెబితే యజమాని వినడం లేదని తెలిపారు.